క్లుప్తంగా

తుంబలిలో 'కంటి వెలుగు'



చిన్నారిని తనిఖీ చేస్తున్న డాక్టర్ నగేష్‌రెడ్డి

జియ్యమ్మవలస: మండలంలోని తుంబలిలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆదేశాలతో శనివారం కంటివెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోగులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేసినట్లు నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు. దృష్టిలోపం ఉన్నవారికి కళ్లద్దాలు అందజేస్తామని చెప్పారు. శస్త్రచికిత్సలకు ఎంపిక చేసిన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేసి ఇంటికి క్షేమంగా పంపించే వరకు బాధ్యత తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు తప్పనిసరి



రోగిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): ప్రజలంతా తప్పనిసరిగా నేత్ర పరీక్షలు చేయించుకోవాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కురుపాం మండలంలోని గొటివాడలో శనివారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోగులకు వైద్య సేవలందించారు. పలువురిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నగేష్‌రెడ్డి మాట్లాడుతూ, ఉచితంగా ఆపరేషన్లు చేసి స్వగ్రామాలకు చేరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బెంచీల ఏర్పాటు



వీరఘట్టం బాలికోన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన బెంచీ

వీరఘట్టం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు (1999 టెన్త్ బ్యాచ్) హైస్కూల్ గ్రౌండ్‌లో విద్యార్థులు సేదదీరేందుకు ఎనిమిది బెంచీలను శనివారం ఏర్పాటు చేశారు. అలాగే ఇదే ప్రాంగణంలో ఉన్న బాలికోన్నత పాఠశాల వద్ద కూడా బెంచీలు అమర్చారు. అలాగే గ్రౌండ్‌లో విద్యుత్ సదుపాయం కల్పించేందుకు ఇనుప స్తంభాలను కూడా ఏర్పాటు చేశారు.

ఘనంగా దత్త జయంతి

సాలూరు: దత్త జయంతి సందర్భంగా శనివారం పట్టణంలో షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలాభిషేకాలు, హోమాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భారీ అన్న సమారాధనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లక్ష్య సాధన వైపు..

- వంద రోజుల యాక్షన్ ప్లాన్
- పదిలో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం
- ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు



పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న ఉన్నత పాఠశాల విద్యార్థులు

పాలకొండ రూరల్: ప్రస్తుత విద్యా సంవత్సరం పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కంకణం కట్టుకున్నారు. ఇందు కోసం విద్యాశాఖ పంపించిన నూతన టైమ్ టేబుల్ ప్రకారం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు బోధిస్తున్నారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో ఒక గంట పాటు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకుంటూ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.

యాక్షన్ ప్లాన్..

- విద్యార్థులకు పరీక్షల పట్ల ఉన్న భయాన్ని తగ్గించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి స్లిప్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.
- ప్రథమ, ద్వితీయ, తృతీయ విభాగాలుగా విద్యార్థులను విభజించి, తృతీయ స్థానంలో ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు..
- వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు తగిన సమయం కేటాయిస్తున్నారు.
- రోజూ ఉదయం 8.15 నుంచి 9.15 గంటల వరకు.. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.
- రోజుకో సబ్జెక్ట్ వంతున వారానికి 7 సబ్జెక్టులు బోధిస్తున్నారు.
- ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థుల్లో భయాన్ని తొలగిస్తున్నారు.
- ఇప్పటివరకు ఫార్మాట్ – 1, 2 పరీక్షలు నిర్వహించారు.
- సమ్మేటివ్ –1 పరీక్షలు తాజాగా జరగగా, జనవరి లేక ఫిబ్రవరి మొదటి వారంలో సమ్మేటివ్ –2 పరీక్షలు జరగనున్నాయి.



ప్రత్యేక తరగతల్లో భాగంగా పరీక్షలు రాస్తున్న ఎం.సింగుపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

పక్కాగా యాక్షన్ ప్లాన్

అన్ని ప్రభుత్వ హైస్కూళ్లలో వంద రోజుల యాక్షన్ ప్లాన్ పక్కాగా అమలు చేస్తున్నాం. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఈ ప్లాన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో మండల విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారనే నమ్మకం ఉంది. ఈ ఏడాది మండంలోని తొమ్మిది ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 4,102 మంది పరీక్షలకు హాజరుకానున్నారు.

– కె.సోంబాబు, ఎంఈఓ, పాలకొండ మండలం

ఫార్మేటివ్ పరీక్షలు బాగా రాశా..



ఫార్మేటివ్ పరీక్షలు బాగా రాశాను. ఫస్ట్‌క్లాస్ సాధించాలనే లక్ష్యంతో కష్టపడి చదువుతున్నానున. ప్రత్యేక తరగతుల వల్ల మాకు మేలు జరుగుతుంది. రోజుకు ఒక సబ్జెక్ట్ ఉదయం, సాయంత్రం చెప్పడం బాగుంది. సందేహాలు వస్తే వెంటనే అడగడం వల్ల అక్కడికక్కడే నివృత్తి చేస్తున్నారు.

–ఆర్.మణికంఠ, ఎం.సింగుపురం, జెడ్పీ ఉన్నత పాఠశాల, పాలకొండ మండలం

ప్రత్యేక తరగతులు మేలు..



ప్రత్యేక తరగతుల వల్ల మరింత సమయం చదువుకునే అవకాశం కలుగుతుంది. మాకు వచ్చే సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు. సిలబస్ రివిజన్ చేస్తున్నారు. సాయంత్రం సమయంలో స్కూల్ నుంచి ఇంటికి వెళ్లిన వెంటనే ఆటపై దృష్టి పడుతోంది. ఇక్కడే ఉండి చదువుకోవడం వల్ల తోటి విద్యార్థులతో పోటీపడి నేర్చుకుంటున్నాం. స్లిప్ టెస్ట్‌ల వల్ల పోటీతత్వం పెరుగుతుంది.

–జ్యోత్స్న, పదో తరగతి విద్యార్థిని, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాలకొండ

రాజీమార్గం అనుసరణీయం



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి విజయరాజ్‌కుమార్

పాలకొండ రూరల్: కోర్టు పరిధిలో ఉన్న దీర్ఘకాల కేసుల పరిష్కారంలో రాజీమార్గం అనుసరణీయమని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ.విజయరాజ్‌కుమార్ అన్నారు. జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో భాగంగా శనివారం 109 పెండింగ్ కేసులను పరిష్కరించారు. వివిధ కేసులకు సంబంధించి రూ. 25 లక్షల అపరాధ రుసుం వసూలు చేసినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.విజయలక్ష్మి, లోక్ అదాలత్ సభ్యులు జి.సత్యం నాయుడు, న్యాయవాదుల బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

శిశువు ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది



శిశువుకు చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

సీతంపేట: మండలంలోని తోటగూడ గ్రామానికి చెందిన సవర శారద రెండో కాన్పు నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేరింది. శనివారం ఉదయం 10 గంటలకు మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే బిడ్డ ఉమ్మనీరు తాగడంతో ఎటువంటి చలనం లేకపోవడంతో వైద్యులు మనోజ్‌కుమార్, సుభాష్ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. దీంతో 108 సిబ్బంది గణపతి, మురళి తల్లీబిడ్డలను అంబులెన్స్‌లో తీసుకువస్తూ ఏఎంబీ బ్యాగ్ ద్వారా ఆక్సిజన్ అందించడంతో మార్గమధ్యలో బేబీకి కదలికలు వచ్చాయి. రిమ్స్‌కు సకాలంలో శిశువును చేర్చడంతో అక్కడి వైద్యులు వెంటిలేటర్‌పై శిశువుకు చికిత్స అందిస్తున్నారు. దీంతో పలువురు 108 సిబ్బందిని అభినందించారు.

అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలి

- యూటీఎఫ్ నాయకులు

సీతంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల టీచర్లను 400 కిలోమీటర్ల దూరంలో గల పాడేరు ప్రాంతంలో గురుకుల పాఠశాలలకు డిప్యుటేషన్ వేయడం తగదని.. ప్రభుత్వం వెంటనే స్పందించి డిప్యుటేషన్లు రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు ఆరిక భాస్కరరావు డిమాండ్ చేశారు. 25 రోజులుగా స్థానిక ఐటీడీఏ ముఖద్వారం వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్న గిరిజన గురుకులాల అవుట్ సోర్సింగ్ టీచర్లకు యూటీఎఫ్ నాయకులు శనివారం సంఘీభావం తెలిపారు. ఆశ్రమ పాఠశాలల ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు పక్క మండలంలో సర్దుబాటు చేయాల్సింది పోయి జిల్లాలను దాటి డిప్యుటేషన్ వేయడం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్‌లో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుండంగి కృష్ణారావు, సీతంపేట మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కె.ఆనందరావు, పకీరు, బి.జయప్రకాష్, ఎ.రాము, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

నవగాంలో నీటి సంఘ ఎన్నిక వాయిదా



పాలకొండ రూరల్ : నవగాం పోలింగ్ కేంద్రం వద్ద వివరాలు సేకరిస్తున్న సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి

పాలకొండ రూరల్: మండలంలోని నవగాం మేజర్ నీటి సంఘ ఎన్నిక వాయిదా పడింది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల పోలింగ్ కేంద్రంలో టీసీ–5కు సంబంధించి రసాభాస నెలకొంది. అభ్యర్థులు ముంజేటి త్రినాథ, మెరగల లక్ష్మునాయుడు వర్గాల మధ్య ఓట్ల విషయంలో తలెత్తిన వాగ్వాదం చినికి చినికి గాలివానలో మారి చివరకు భౌతిక దాడులకు దారితీసింది. ఈ క్రమంలో లక్ష్మునాయుడు వర్గానికి చెందిన కొంతమంది వ్యక్తులు బూత్‌లోకి చొరబడి ఎన్నికల నిర్వహణ సామాగ్రిని తీసుకుపోడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. విషయం తెలుసుకున్న పాలకొండ సబ్ కలెక్టర్ సి. యశ్వంత్‌కుమార్‌రెడ్డి పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. సంఘటనపై ఎన్నికల నిర్వహణ సిబ్బందితో పాటు అభ్యర్థుల నుంచి వివరాలు సేకరించారు. చివరకు ఈ ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఎన్నికల సామగ్రి తీసుకువెళ్లిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డీఎస్పీ ఎం.రాంబాబును ఆదేశించారు.

ఎన్నికల బహిష్కరణ

భామిని: మండలంలో 25 నీటి సంఘాలుండగా.. శనివారం జరిగిన ఎన్నికల్లో బురుజోల, పెద్దదిమిలి సంఘాలకు సంబంధించి రైతులు ఎన్నికలను బహిష్కరించారు. నీటితీరువా కట్టడానికి ఇష్టపడని ఆయకట్టు రైతులు ఎన్నికలకు దూరంగా ఉండడంతో.. మిగిలిన 23 సంఘాలకు అధికారులు ఎన్నికలు నిర్వహించారు.

వీరఘట్టం: మండలంలోని 13 నీటి సంఘాల్లోని 138 టీసీలకు ఎన్నికలు నిర్వహించగా.. 133 టీసీలు ఏకగ్రీవం కాగా.. ఐదు టీసీలకు ఎన్నికలు నిర్వహించారు. పాలకొండ సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలో 11 నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికలను తహసీల్దార్ శివన్నారాయణ పర్యవేక్షించారు.

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండలంలోని 22 నీటి సంఘాలకు గాను అన్నీ ఏకగ్రీవమైనట్లు తహసీల్దార్ రవణమ్మ తెలిపారు. ఎన్నికలను మండల ప్రత్యేకాధికారి కె.రామచంద్రరావు పర్యవేక్షించారు.

కొమరాడ: మండలంలో పది నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించగా..అన్నీ ఏకగ్రీవమయ్యాయి. తహసీల్దార్ శివయ్య, మండల ప్రత్యేకాధికారి ఎ. రాజశేఖరరెడ్డి పర్యవేక్షించారు.

పాలకొండ రూరల్: పాలకొండ మండలంలోని 11 సంఘాల పరిధిలో 114 టీసీలకు గాను 106 ఏకగ్రీవమయ్యాయి. ఎనిమిది చోట్ల ఎన్నికలు జరిగాయి.

సీతంపేట: మండలంలోని రెండు నీటి సంఘ ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు తహసీల్దార్ అప్పలరాజు తెలిపారు.

గరుగుబిల్లి: మండలంలోని 17 సాగునీటి సంఘాల ఎన్నిక ఏకగ్రీవమైందని అధికారులు తెలిపారు. తహసీల్దార్ టి. బాల, ఎంపీడీఓ జి. పైడితల్లి, ఇరిగేషన్ ఏఈ కె. ప్రవీణ్‌సాగర్ పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి

జియ్యమ్మవలస: మండలంలోని 108 టీసీలకు గాను 97 చోట్ల ఏకగ్రీవం కాగా.. మిగిలిన చోట్ల ఎన్నికలు జరిగాయి. వట్టిగెడ్డ ఏఈ జీవీ రఘు, ఎంపీడీఓ రమేష్, తదితరుల పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు.

విద్యుత్ చార్జీల పెంపుపై ఆగ్రహ జ్వాల



పాలకొండ: విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



సీతంపేట: విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



గరుగుబిల్లి: విద్యుత్ చార్జీలపై నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు



కొమరాడ: దంగభద్రలో విద్యుత్ బిల్లులు దహనం చేసి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పాలకొండ: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలల్లో రెండుసార్లు విద్యుత్ చార్జీలు భారీగా పెంచ డంపై సీపీఎం ఆధ్వర్యంలో శనివారం భారీ నిరసన చేపట్టారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యుడు దావాల రమణారావు మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని ఎన్నికల సమయంలో చంద్రబాబు, లోకేష్‌లు పిలుపునిచ్చారని.. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై బాదుడు కు దిగారని ఆరోపించారు. ట్రూఅప్ సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీల వడ్డిస్తున్నారని మండిపడ్డారు. అక్టోబర్‌లో ఒక వినియోగదారుడుకి రూ 386 బిల్లు వస్తే ఈ నెలలో 10 యూనిట్లు తగ్గినప్పటికీ 503 రూపాయల బిల్లు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీల పెంపు తగ్గించకపోతే ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎ. లక్ష్మణరావు, డి. దుర్గారావు, కె. రాము, ఎం. రమేష్, పలువురు చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

పెంపుదల అన్యాయం..

సీతంపేట: ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచిందని సీపీఎం నాయకులు పి.వీరన్న, తోటన్న అన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ పీవీ ఈతమానుగూడలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ బిల్లులను దహనం చేశారు. కార్యక్రమంలో సంజీవరావు పాల్గొన్నారు.

వెంటనే తగ్గించాలి..

కొమరాడ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ట్రూఅప్ చార్జీల పేరుతో కరెంటు బిల్లులు పెంచడం దారుణమని పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వాకాడ ఇందిర డిమాండ్ చేశారు. మండలంలోని కుమ్మరిగుంట, కందివలస, దంగభద్ర, తదితర గ్రామల్లో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొల్లు సాంబమూర్తి మాట్లాడుతూ, చంద్రబాబు ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక చార్జీలు పెంచడం దారుణమన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకుడు రామారావు, సీపీఎం శ్రేణులు, తదితరులు పాల్గున్నారు.

తగ్గించాలి

గరుగుబిల్లి: సర్దుబాటు పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు బస్టాండ్ ఆవరణలో సీపీఎం నాయకులు బీవీ రమణ, కరణం రవీంద్ర మాట్లాడుతూ.. అదానీతో విద్యుత్ ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని కోరారు. టీడీపీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అదానికి అమ్ముడు పోయి విద్యుత్తు ట్రూఅప్ చార్జీల పేరిట ప్రజలకు ఆర్థిక భారం మోపిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి బాబు ఇప్పుడు విద్యుత్ చార్జీలు పెంచడం సరికాదని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ఆర్.సూర్యనారాయణ, డి.వెంకటనాయుడు, కె.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



పశుపోషణ భారం

- యంత్రాల వినియోగంతో ఎండుగడ్డి కొరత
- విపరీతంగా పెరుగుతున్న దాణా ఖర్చులు
- మరోవైపు జీవాలను వేధిస్తోన్న వ్యాధులు
- తగ్గుతున్న పాల దిగుబడి
- ఆందోళనలో పాడిరైతులు

రాజాం నియోజకవర్గంలో పాడి పశువులు ఇలా..	
మండలం	పాడి పశువులు (ఆవులు, గేదెలు)
రాజాం	7800
రేగిడి	8200
వంగర	8600
సంతకవిటి	7400

రాజాం సిటీ:

పాడిరైతుకు పశుపోషణ భారమైంది. వ్యవసాయంలో యాంత్రీకరణ(యంత్రాల వినియోగం) కారణంగా ఎండుగడ్డి అంతగా దొరకని పరిస్థితి ఏర్పడింది. దీంతో పాటు విపరీతంగా పెరిగిన దాణా ఖర్చులు ఓ వైపు.. జీవాలను నిత్యం వేధించే రకరకాల వ్యాధులు మరోవైపు.. పశుపోషకులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పశుగ్రాసం కొరతతో జీవాలు బక్కచిక్కిపోయి ఫలితంగా పాల దిగుబడి తగ్గిపోతోందని పాడిరైతులంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పశువులు పెంచేందుకు ఎవరూ అంతగా ఆసక్తి కనబరచడం లేదు. రాజాం పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోనూ వ్యవసాయంలో ఏటా యంత్రాల వినియోగం పెరుగుతుండడంతో ఎండుగడ్డి కొరత ఏర్పడుతోంది. ఎక్కడో ఓ చోట దొరికే కాస్త ఎండుగడ్డికి మంచి డిమాండ్ ఏర్పడుతుండడంతో కొంతమంది పశు యజమానులు గడ్డిని కూడా కొనుగోలు చేయలేని దుస్థితి తలెత్తుతోంది. ఓ వైపు దాణా ఖర్చులు, మరోవైపు ఎండుగడ్డి ఖర్చు భారంగా మారడంతో పశుపోషణ ఎలా అని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దాణా రేట్లు ఇలా..	
దాణా రకం	ధర
తవుడు(50 కిలోలు):	రూ.1400
నూకలు(పెద్దవి 50 కిలోలు):	రూ.1200
నూకలు(చిన్నవి 50 కిలోలు):	రూ.1100
బఠాణీ బొత్తు(20 కిలోలు ఎ–1రకం):	రూ.1200
బఠాణీ పిండి(50 కిలోలు):	రూ.1500
మినప పొట్టు(50 కిలోలు):	రూ.1250
పెసరపొట్టు(50 కిలోలు):	రూ.1200
ట్రాక్టరు వరిగడ్డి(గతంలో):	రూ.5500

ఇష్టారాజ్యంగా ధరలు..

పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారు నానాపాట్లు పడాల్సి వస్తోంది. రైతులంతా పశువుల కోసం ఎండుగడ్డితో పాటు తవుడు, నూకలు, బఠాణీ బొత్తు, పెసర బొత్తు, మినప పొట్టు తదితర వాటిని వినియోగిస్తున్నారు. వీటినే ఆసరాగా చేసుకుని వ్యాపారులు ఇష్టారాజ్యంగా వాటి ధరలు పెంచుకుంటూ పోతున్నారు. దీంతో పాడిరైతులు చేసేదేమీలేక తప్పనిసరి పరిస్థితుల్లో వారి పెంచిన ధరకే దాణా కొనుగోలు చేయాల్సి వస్తోంది. పాలసేకరణ కేంద్రాల్లో పాల ధరలు తక్కువగా ఇస్తున్నప్పటికీ దాణా మాత్రం ఎంత ఎక్కువైనా తప్పకుండా కొనుగోలు చేసి వేయాల్సి వస్తోందని, లేకపోతే ఆ వచ్చే పాలు కూడా పశువుల నుంచి సక్రమంగా రావని పాడిరైతులు వాపోతున్నారు. శీతాకాలంలో పాడి పశువులకు వేడిపుట్టి పాల దిగుబడి రావాలంటే ఇటువంటి దాణాలు వేయాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు స్పందించి, ప్రభుత్వం ద్వారా దాణా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కనీసం దాణా ఖర్చుల భారమైనా లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తున్నారు.

పాడి కలిసిరావడం లేదు..

ఒకప్పుడు కలిసొచ్చిన పాడి పరిశ్రమ ప్రస్తుతం కలిసిరావడం లేదు. ఓ పక్క మేతలు లేక.. మరోపక్క వ్యాధులు భయంతో ఇబ్బందులు పడుతున్నాం. దాణాల రేట్లు బాగా పెరిగిపోయాయి. అయినా పాలవ్యాపారంతో కుటుంబం పోషించుకోవచ్చన్న ఆశతో దాణా కొనుగోలు చేసి, వినియోగిస్తున్నాం. ఇదే అదనుగా వ్యాపారులు దాణా ధరలు పెంచేస్తున్నారు.

–శాసపు సత్తిబాబు, పాడిరైతు, పానుగుటివలస గ్రామం

సబ్సిడీపై దాణా అందించాలి..

ప్రస్తుతం దాణా ఖర్చుల భారమవుతున్నందున ప్రభుత్వమే సబ్సిడీపై దాణా అందించాలి. అలాగే సకాలంలో పశువైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి. పాల దిగుబడి పెరగాలంటే పశువులకు తగినంత పౌష్టికాహారం అందివ్వాలి. ప్రభుత్వ సహకారం ఉంటే బాగుంటుంది.

–ఎ.వెంకటేష్, పాడిరైతు, రాజాం

ఆర్థికసాయం..



జియ్యమ్మవలస మండలం చినమేరంగికి చెందిన అగ్ని ప్రమాద బాధితుడు గొట్టిపల్లి సింహాచలం కుటుంబానికి వారి కుల సంఘ సభ్యులు శనివారం రూ. 25 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ శివప్రసాద బ్రహ్మ, తెలుకల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రావుపల్లి చంద్రశేఖర్, కులపెద్దలు పాల్గొన్నారు.

– జియ్యమ్మవలస

హిమోగ్లోబిన్ పరీక్షలపై శిక్షణ

పార్వతీపురం టౌన్: టూ హెచ్‌బీ పరికరంతో హిమోగ్లోబిన్ పరీక్షలపై శిక్షణ వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో, హైరిస్క్ గర్భిణుల నిర్వహణ నియమాలపై శిక్షణ స్థానిక ఎన్జీఓ హోమ్‌లో శనివారం నిర్వహించారు. వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు కార్యక్రమాల్లో పాల్గొని వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రశాంత్, కృష్ణమూర్తి, పాల్గొన్నారు.